10 ఆదివారం ఆంధ్రభూమి 4 డిసెంబర్ 1994

ఈ వారం కథ

# ఏదేశమేగినా...

ఆరె పద్మజా చౌదరి

ఆ రోజంతా చికాగ్గా ఉంది.

నిద్ర లేవడమే చికాకుతో మొదలైతే నాకెప్పుడూ అంతే జరుగుతుంది. నిజానికి ప్రొద్దున్నే లేచి చాలా వంట చెయ్యాల్సిన పని నా ముందు ఉంది.

అది ప్రతిరోజూ ఉండే తంతేను.

నిద్ర ఎప్పుడు మెలకువ వచ్చినా ముందు టైం చూచుకుంటాను. నా వాచీలో టైంకు గంటన్నర తగ్గించి, రాత్రిని పగలు, పగలును రాత్రిగా మార్చుకొని ఇండియాలో సమయాన్ని, దృశ్యాన్ని నా మనోనేత్రంతో తిలకిస్తాను. ప్రతిరోజూ అంతే! నాకు ఉదయం మెలకువ వచ్చే టైం ఇండియాలో సాయంత్రం. అంటే నా పిల్లలు ఆటల్లో మునిగిపోయి ఉంటారు. ఆటల్లో మునిగిపోయి సర్వం మర్చిపోయి ఏమరుపాటుగా కాలుజారి పడిపోయి 'అమ్మా' అని బాధగా మూలిగారేమో — అనిపిస్తుంది. లేకపోతే గతంలోని సంఘటన స్మృతిగా నన్ను ముప్పిరిగొంటుంది. నా కళ్ళు నీళ్ళతో నిండుకుంటాయి.

గుండెం గడ్డలా మారిపోయే క్షణాలు రోజుకెన్ని? హృదయం సొమ్మసిల్లిపోయేదాకా, కళ్ళు కాయలు కాచేదాకా, కన్నీళ్ళతో దిళ్ళు తడిసి ముద్దలైపోయేదాకా కుళ్ళి కుళ్ళి నేను ఏడుస్తుంటే—

విగ్రహంలా — నన్ను తిలకించే ఆయన ఆరోజూ ఎప్పటిలానే "ఎనిమిదయ్యింది" అన్నారు తొందర చేస్తూ.

ఒక్కమారు కంఠం విప్పి "నీ పిల్లలు సుఖంగా ఉన్నారు" అని ఓదార్చరేం?

ఒక్కసారి దగ్గరకు తీసుకొని "ఏడవకు ఏడవకు" అని లాలించరేం!

ఇంకపైగా అప్పుడెప్పుడో "నా దగ్గర ఏడవకు... నేను తట్టుకోలేను" అన్నారు.

అప్పటినుండీ ఆయనముందు నిగ్రహాన్ని పాటించాలని ఎంత ప్రయత్నించినా సాధ్యం కావటంలేదు.

"ఎనిమిది" అన్న మాటకు ఒక్క ఉదుటున లేచి బాత్రూంలోకి వెళ్ళాను. చెంపలమీద చారికల్నయితే చెరిపేసుకుని ఫ్రెష్‌గా తయారయ్యాను గానీ హృదయంమీది చారలు చెరగనంటున్నాయి.

ఎప్పటిలా వంటా — వార్పు — వడ్డన లేకుండా స్కూలుకు బయలుదేరాను. ఇండియన్ ఫుడ్డే కావాలన్న నియమం లేకపోతే అమెరికాలో తిండికేం కొదవ?

దార్లో అడిగారు — "ఈరోజు మా మిసెస్ బ్రూక్సు బర్త్‌డే అన్నావు" అంది.

"నేను మర్చిపోలేదు."

"వంటలు చేస్తున్నావన్నావు?"

"సాయంత్రం వచ్చి చేసి పెడ్తాన్లెండి" వ్యంగ్యం. పిల్లల్ని వదిలి వచ్చినందుగ్గాను ఆయనతో ఇంతవరకు తిన్నగా పదిమాటలు మాట్లాడిందెప్పుడు? నా సంగతి బాగా అనుభవం కాబట్టి ఆయన పట్టించుకోలేదు.

ఆ మాటా ఈ మాటా చెప్తూ నన్ను తీసుకువెళ్ళి నా స్కూలు ముందు దించారు. దిగబోతూ "రాత్రి చేసిన ఆలూ కూరా, సాంబారు ఉన్నాయి. అన్నం కొద్దిగానే ఉంది. పెరుగు ఉంది. రెండు టోర్టిల్లాస్ (పుల్కాల్లాంటి రెడీమేడ్ రొట్టెలు) మైక్రోవేవ్‌లో వేడి చేసుకొని తినండి.. ప్లీజ్" అన్నాను.

"అలాగే."

"సాయంత్రం వచ్చి మీకు ఫ్రెష్‌గా టర్కీ చేసి పెడ్తాగా".

"అలాగే."

"బై."

ఆయన కారు బ్యాక్ చేసుకున్నాక నా బిల్డింగులోకి నడిచాను.

వీక్లీ షీట్‌మీద నా పేరుకు ఎగవెస్టుగా ఉన్న కాలమ్స్‌లో శుక్రవారంలో నేను వెళ్ళిన టైం వేసి నా క్లాసు రూంలోకి వెళ్ళాను.

తొమ్మిది గంటలకు నేను వెళ్ళేసరికి నా పిల్లలు అప్పుడే బ్రేక్‌ఫాస్టు ముగించి ఉంటారు. వాళ్ళతో నా అసిస్టెంట్ ఒంటరిగా సతమతమౌతూ ఉంటుంది. నన్ను చూచి ఊపిరి పీల్చుకుంటుంది. క్లీనప్ చేయడానికి గబగబా కిచెన్‌లోకి వెళ్ళింది.

నా పిల్లలు మొత్తం పదిహేనుమంది—

నా పిల్లలు అనగానే ఒక సంఘటన సదా గుర్తుకు వస్తుంది. ఒకరోజు సాయంత్రం నేను అప్పుడప్పుడు మేనేజరుగా పార్ట్‌టైం జాబ్‌చేసే సూపర్ మార్కెట్‌లో డెరిల్‌తో 'ఈరోజు నా పిల్లలు బాగా అల్లరి చేశారు. తలనొప్పిగా ఉంది' అన్నాను.

"మీకెంత మంది పిల్లలు?" అన్నాడు.

"పదిహేను? ఎలా మేనేజ్ చేస్తున్నారు?"

"నాకొక అసిస్టెంటు ఉంది... పదిహేనుమంది పిల్లలున్నారు"

"ఐ సీ... మీకూ స్వామికీ పదిహేను మంది పిల్లలా?" అతనింకా ఆశ్చర్యంనుండి తేరుకోలేదు.

నకాల్లు నవ్వేశాను.

"మీరెంత మనసారా నవ్వుతారు!" అన్నాడు.

"గోల్డు స్మిత్ ఏమన్నాడు?"

"అతనెవరు?"

"చెప్పినా మీకర్థం కాదు. అతనొక మహా రచయిత. పకపకా నవ్వే మనిషి గుండెల్లో ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలౌతున్నాయో! అని."

"ఐయాం సారీ" అన్నాడు నిజాయితీగా.

"నో... డెరిల్... ఐ డోంట్ హేవ్ ఎనీ" మళ్ళీ నవ్వాను.


ఇప్పుడా పదిహేను మంది పిల్లలూ ఊకుమ్మడిగా వచ్చి, నా మీద దండయాత్ర చేసి ఎవరికి వారు తామే నా చెంత ఉండాలన్న తాపత్రయంతో ఒకర్ని ఒకరు తోసుకుంటూ, నన్ను అందిన చోటల్లా పట్టుకుంటూ ముక్త కంఠంతో "హాయ్ మిస్ సా" అన్నారు

ఒక్కొక్కర్ని దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకొని "హౌ ఆర్యూ?" అని పేరు పేరునా ప్రశ్నిస్తుంటే

ఆ స్పర్శలో, ఆ మమతలో—

దూరమైనా నా పిల్లల స్పర్శ, అమ్మ కావాలనుకున్న వారి తపన తిరిగి పొందుతున్న అనుభూతి.

నాలో నిన్న సాయంత్రం ఇంటికి వెళ్ళిన దగ్గర్నుండీ కరడుగట్టుకుపోయి



న ఒక భావమేదో మెల్లగా కదిలి, కరిగి, నీరై, నా ఎదలో పొంగి పొరలి, నా మమతల పొరల్ని స్పృశించి—

ఈ అమెరికన్లకేం తెలుసు?

ఇండియన్స్ అంతా ఇంత బాగా పిల్లల్ని ప్రేమిస్తారా? అనుకుంటారు. వాళ్ళకు తెలియదు. నేను స్వార్థపరురాలిని అని. ఈ పసిగాయలు నిష్కపటంగా ప్రదర్శించే ప్రేమలో దూరమైన దాన్ని పొందే ప్రయత్నంలో నేనున్నాని.

మెల్లగా బిల్డింగులో సందడి ప్రారంభం అయ్యింది. ప్రొద్దుటినుండి మిసెస్ బ్రూక్సుని ఎవ్వరూ చూడలేదుట.

"ఆమె పెద్దదైపోయింది. ఈ పార్టీలకు ఇష్టపడటం లేదు" అనుకున్నారు

"అదేం కాదు... షి ఈజ్ బిజీ" అన్నారు ఇంకొకరు.

మిసెస్ బ్రూక్సుకు మా ప్రిస్కూలుతో కలిపి మొత్తం నాలుగు ఆర్గనైజేషన్సు, అరవైమంది పైగా స్టాఫు ఉన్నారు. ఆరోజు ఆమె పుట్టిన రోజుని మా పక్క బిల్డింగులోని 'రిసోర్సు సెంటర్లో'ని పెద్దహాల్లో జరపటానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

సరిగ్గా ఒంటిగంటకు పార్టీ ప్రారంభం. మాకు లంచ్ బ్రేక్ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి నుండి రెండు వరకు నాకు బ్రేక్, రెండునుండి మూడు వరకు నా అసిస్టెంట్‌కు. అలాగే మిగిలిన అన్ని గదుల్లోనూ. మధ్యాహ్నం పన్నెండున్నర నుండీ మూడు వరకూ పిల్లలకు 'నేప్ టైం'. వాళ్ళను నిద్రలు లేపాక వాష్‌రూం పనులు, షూస్ పనులు అయిపోయాక స్నాక్సు... తర్వాత కలరింగ్, రైమ్సు ఉంటాయి.

ఆరోజు నా అసిస్టెంటు "నేను ఒంటిగంటకే వెళ్ళిపోతాను. నాకు డాక్టరు అప్పాయింటుమెంటు ఉంది" అంది.

పిల్లలంతా ప్రశాంతంగా నిద్రపోతున్నారు. ఇంటికి లెటర్ వ్రాయాలనిపించింది. అయినా ఏదో నిర్లిప్తత బహుశా పార్టీకి ఏం చేసుకురాలేదన్న గిల్టీ కాన్షస్ కావచ్చును. ఏం తీసుకోకుండా ఎలా వెళ్ళాలి? వెళ్ళకుండా ఎలా ఉండాలి?

మిసెస్ బ్రూక్సు నా ఎంప్లాయర్! ఆమె పుట్టిన రోజున విష్ చేయకపోవటం సభ్యత కాదు. పైగా మిగిలిన వాళ్ళు అదే సందు అని ఆమెను ప్లీజ్ చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నారు. ముఖ్యంగా ఇద్దరు పాకిస్తానీ లేడీస్. మిసెస్ బ్రూక్సు కోసం పెద్ద పెద్ద ఫ్లవర్ బొకేలే గాకుండా, చిన్న చిన్న గిఫ్టు ప్యాకెట్లూ తెచ్చారు.

"బెండాలాన్, జీనాలాన్ నిర్లక్ష్య వైఖరిని తాము ప్రదర్శించలేరు కదా! వాళ్ళకు పని అన్న నిర్లక్ష్యమే. ఎంప్లాయిర్ అన్నా నిర్లక్ష్యమే! ఆ మాటే ఆయనతో అంటే—

"అందరూ నీలా బాగా పని చేస్తే నీకెవరు ఉద్యోగాలు ఇవ్వబోయారు? అమెరికన్లు హార్డు వర్కు చేస్తేనూ, మెక్సికన్లకు బుర్ర ఉంటేనూ ఆసియన్లకు తావెక్కడ?" అన్నారు.

నోరు మూసుకున్నాను. ఇంకొకళ్ళతో నంతు నాకేల? నేను జీతం తీసుకుంటున్నాను — నిజాయితీగా పని చేస్తాను — అనుకున్నాను.

ఒకటిన్నరకు మా డైరెక్టరు వచ్చి "పార్టీకి వెళ్ళవా?" అంది.

"నా గదిలో ఎవ్వరూ లేరు" అన్నాను.

గట్టిగా ఏమైనా అంటే ఆమె నా గదిలో కూర్చోవాలి అందుచేత ఆమె మాట్లాడకుండా వెళ్ళిపోయింది. ఇదే సందు పార్టీ తప్పించుకోను — అదృష్టవశాత్తు అసిస్టెంటు వెళ్ళిపోయింది.

అయితే చాలా రోజులు చిన్నతనంగానూ, గిల్టీగానూ ఫీలయ్యాను. కనీసం ఆ సాయంకాలం ఇంటికి వెళ్తూ అయినా మిసెస్ బ్రూక్సుకి గ్రీటింగ్స్ చెప్పాల్సింది. ఏదీ చేయలేదు. ఆ పదిహేను మంది పిల్లల విషయం, ఇతర విధులు తప్ప మరేం చేయలేని నిర్లిప్తత, అచైతన్యం, భావశూన్యత.

మిసెస్ బ్రూక్స్‌కి బర్త్‌డే గ్రీటింగ్సు చెప్పని గిల్టీ ఫీలింగ్ నుండి నేనింకా తేరుకోకముందే మా మేనేజ్‌మెంట్ మాకు క్రిస్మస్ పార్టీ తలపెట్టింది. డైరెక్టరు వచ్చి ఎవరెవరు వచ్చేదీ వ్రాసుకు వెళ్ళింది.

పార్టీ ఇంకా రెండు రోజులే ఉంది. మధ్యాహ్నం రెండు గంటలవేళ పిల్లలు నిద్రపోతున్నారు. ఇండియాలో అర్ధరాత్రి పన్నెండున్నర ... నా పిల్లలూ ఆదమరచి అమ్మను మరిచి నిద్రపోతూ ఉంటారు. అక్కడ నిలబడి చూస్తుంటే ఒక్కొక్క ముఖంలో ఒక్కొక్క మిని, ఒక్కొక్క స్నిగ్ధ ముగ్ధమనోహరంగా నవ్వుతూ పలుకరించినట్లే అనిపించింది.

సరిగ్గా అప్పుడు నా గది తలుపు మీద చిన్నగా చప్పుడు. నెమ్మదిగా వెళ్ళి చూచి నివ్వెరపోయాను.

ఎదురుగా మిసెస్ బ్రూక్స్.

"నిన్ను పార్టీకి ఆహ్వానించడానికి వచ్చాను. ఎలాగైనా రావాలి" అంది.

"సరేను... థాంక్యూ వెరిమచ్ ఫర్ ద కన్‌సర్న్."

ఆమె వెళ్ళిపోయింది.

టైమింగ్సు సర్దుబాటు చేసుకొని నేనూ ఆయనా ఎలాగో పార్టీకి వెళ్ళాం. డిన్నర్ కాగానే హడావుడిగా ఆమె దగ్గరకు వెళ్ళి "మాకు శెలవు ఇప్పించండి" అన్నాం మర్యాదగా. ఎవరో ముఖ్యమైన వారితో అతి ముఖ్యమైన విషయం ఏదో చర్చిస్తున్న మిసెస్ బ్రూక్సు కంగారుగా లేచి —

"అప్పుడే వెళ్ళకు... నేను సర్వీస్ సర్టిఫికెట్లు ఇవ్వాలి. ప్లీజ్" అంది.

ఆగిపోయాం... ఉస్సూరంటూ.

మిసెస్ బ్రూక్సు మైకు దగ్గరకు వెళ్ళగానే హాలంతా నిశ్శబ్దమైంది. ముందు మాటలు అయ్యాక—

"ఒక ఇన్‌స్టిట్యూట్ విజయవంతంగా పని చెయ్యాలి అంటే — దాని వెనుక ఒక వ్యక్తి శక్తిలా నిలబడి ఉంటుంది. ఆ వ్యక్తి అంకిత భావంతో, నిజాయితీగా, తన పనికి హద్దుల్ని చెరిపేసుకొని పనిచేస్తారు. ఆ వ్యక్తిని ఇప్పుడు మీకు పరిచయం చేస్తాను. ఆ వ్యక్తికి నేనిప్పుడు 'ఎంప్లాయీ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందించబోతున్నాను. ఈ అవార్డుని గత నాలుగు సంవత్సరాలుగా అర్హులెవరూ లేక ఎవరికీ బహూకరించలేదు. నా... పద్మజ... ఆరె..ని వచ్చి అవార్డు స్వీకరించవలసిందిగా కోరుతున్నాను. ఆమె ఎప్పుడూ కంప్లయింట్ ఇవ్వలేదు... తనవంతు కన్నా ఎప్పుడూ బాధ్యతను ఎక్కువే స్వీకరించింది... ఐ వాంట్ హర్ టు బి హియర్."

ఆమె కంఠం కంచులా మ్రోగుతుంటే బొమ్మలా నిలబడిపోయాను నేను.

ఒక్క క్షణం నిశ్శబ్దం.

తర్వాత నన్ను విరిగి మీద పడినట్లు పెద్ద పెట్టున హర్షధ్వానాలు... కేకలు ... ఉత్సాహ ప్రకటన.

ఇంతకన్నా పెద్ద సభల్లో పెద్ద అవార్డుల్నే అందుకున్నా నా హృదయం మూగబోయింది. కారణం? ఫారెన్ లాండ్‌లో నాకు లభించిన ఈ ఆదరణే కావచ్చు. నా విధి నిర్వహణలో ఏనాటి గుర్తింపునూ ఎదురు చూడకుండా గానుగెద్దులా వెళ్ళిపోవడమే కావచ్చును. నాలోని కలవరాన్ని పదిమంది చూడరాదని ముందుకు వెళ్ళాను. నా బహుమతిని స్వీకరించటానికి.